ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Thursday, July, 30, 2009.



# దారుణ ప్రణాళిక

పి. వి. సుబ్బయ్యచౌదరి

## సాయం అరకొరే




ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధ్యక్షతన ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకుల కమిటీ (ఎస్.ఎల్.బి.సి.) సమావేశం జరిగింది. వ్యవసాయరంగానికి 2009-2010 సంవత్సరానికి రూ.55వేలకోట్ల రుణప్రణాళికను ఆ సమావేశంలో విడుదల చేశారు. దాన్ని రూపొందించడంలో అనుసరించిన విధివిధానాలు, వివిధ పద్దుల కింద కేటాయించిన నిధులు, ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించిన స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక పరపతి కల్పన తదితర అంశాలపై పలు విమర్శలు వచ్చాయి. కొన్ని మండలాల్లో బ్యాంకుల శాఖలు లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో వాటి సంఖ్య తగ్గడంపైనా విమర్శలు వినవచ్చాయి. ప్రస్తుతం విడుదల చేసిన రుణప్రణాళికను- రిజర్వ్ బ్యాంకు నిర్దేశించిన విధివిధానాల ఆధారంగా రూపొందించినట్లు లేదు. నిరుడు అమలుపరచిన రుణప్రణాళికపై 18శాతం వృద్ధి చూపించినట్లు కనిపిస్తోంది. ఏటా మార్చిలోగా విడుదలచేయాల్సి ఉన్న రుణప్రణాళికను ఈసారి జులైలో విడుదల చేశారు. ఈ జాప్యం దృష్ట్యా, రైతులు రుణాలకోసం ప్రత్యామ్నాయాల వైపు చూపు సారించక తప్పలేదు.

## వడ్డీల విషవలయం

మన రాష్ట్రంలో కోటీ20లక్షల44వేల కమతాలు ఉన్నాయి. వాటికింద మూడుకోట్ల ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగుచేస్తున్నారు. రెండుకోట్ల ఎకరాల్లో వర్షాధార పంటలు, కోటి ఎకరాల్లో నీటి వనరుల కింద పంటలు పండిస్తున్నారు. ఉత్పాదక ఖర్చుల్లో పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని, పంటలవారీగా ఈ మూడుకోట్ల ఎకరాలకు కావలసిన వ్యవ సాయ రుణాలను మదింపు వేస్తే- దాదాపు లక్షకోట్ల రూపాయలు అవసరమని తేలుతుంది. అయితే, రాష్ట్ర రుణప్రణాళి కలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.32,500కోట్లు కేటాయించారు. వ్యవసాయ అవసరాలకు బ్యాంకులన్నీ కలసి 25నుంచి 30శాతం నిధులు అందిస్తున్నాయి. మిగిలిన 70నుంచి 75శాతం నిధుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, ఎరు వులు-పురుగు మందుల పంపిణీదారులు వంటివారిపై రైతులు ఆధారపడవలసి వస్తోంది. వడ్డీ వ్యాపారులు, తదితరులు తాము ఇచ్చే అప్పులపై అధిక వడ్డీ వసూలు చేస్తుండటంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

గడచిన మూడేళ్లలో వ్యవసాయ ఉత్పాదకాల ధరలు, వ్యవసాయ కూలీల దినసరి వేతనాలు 250నుంచి 350శాతం వరకు పెరిగాయి. రుణప్రణాళిక ప్రకారం- పంటలవారీగా అందించే పరపతి వాస్తవిక అవసరాలకు సరిపడా లేదు. ఉదాహరణకు- ఒక ఎకరంలో చెరకు పండించాలంటే దాదాపు రూ.55వేలు ఖర్చవుతుంది. ఒక ఎకరాలో పత్తి పండించడానికి సుమారు రూ.40వేలు వ్యయమవుతుంది. అయితే, ఎకరాలో చెరకు పండించేందుకు అయ్యే వ్యయం రూ.21వేలు, పత్తికి అయ్యే ఖర్చు పదిహేనువేల నుంచి 22వేల వరకు ఉంటుందని రుణప్రణాళికలో పేర్కొన్నారు. వరి, జొన్న, సజ్జ, రాగి, మొక్కజొన్న, కందులు, మినుములు, పెసలు, శెనగలు, పొద్దుతిరుగుడు పువ్వు, వేరుశెనగ, ఉద్యానవన పంటల పరిస్థితీ అలాగే ఉంది.

రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం- బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో 40శాతాన్ని ప్రాముఖ్యరంగానికివ్వాలి. ఈ 40శాతం రుణాల నుంచి 18శాతాన్ని వ్యవసాయానికి, రైతులకు నేరుగా ఇచ్చే పరపతి కింద అందించాలి. ఈ ఆదేశాలను బ్యాంకులు సక్రమంగా పాటించడంలేదని పలు కమిటీలు పేర్కొన్నాయి. రిజర్వ్ బ్యాంకు డిప్యూటీ గవర్నర్ ఉషా తోరట్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ కూడా ఈ విషయంలో బ్యాంకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. రాష్ట్రంలో మొత్తం 6999 బ్యాంకు శాఖలు ఉన్నాయి. వాటిలో గ్రామీణప్రాంతాల్లో 2733, పట్టణప్రాంతాల్లో 4266 శాఖలు ఉన్నాయి. గ్రామీణశాఖలు 2007 మార్చి 31వ తేదీనాటికి 2853 ఉండగా, 2009 మార్చి 31 నాటికి వాటి సంఖ్య 2,733కి తగ్గిపోయింది. రాష్ట్రంలోని ఏడు మండలాల్లో అసలు బ్యాంకు శాఖలే లేవు. 109 మండలాల్లో ఒక్కోదానిలో ఒక్క బ్యాంకు శాఖ మాత్రమే ఉంది. గ్రామప్రాంతాల్లో బ్యాంకుల శాఖల సంఖ్య తగ్గిపోవడంపట్ల గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు వ్యవసాయరుణాలు అందించడమంటే దుస్సాహసం చేయడంలాంటిదేనని రిజర్వ్‌బ్యాంక్ 2004-2005 వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో- వ్యవసాయ రుణాలపై బ్యాంకులు ఎలాంటి శ్రద్ధ వహిస్తాయో అర్థం చేసుకోవచ్చు. మన రాష్ట్రంలో గ్రామీణప్రాంతాల్లోని 2,733 బ్యాంకు శాఖల్లో 945 గ్రామీణ బ్యాంకుల శాఖలు. మొత్తం రుణంలో 16శాతం మాత్రమే ఇవి అందించగలుగుతున్నాయి. ప్రాథమిక పరపతి సంఘాలు (పి.ఎ.సి.)లు 16శాతం రుణాల్నే సమకూరుస్తున్నాయి. జాతీయ బ్యాంకుల విషయానికొస్తే- భారతీయ స్టేట్ బ్యాంకు 19శాతం, ఆంధ్రాబ్యాంకు

17శాతం, మిగిలిన జాతీయ బ్యాంకులన్నీ కలిపి 32శాతం వ్యవసాయ రుణాలు అందిస్తున్నాయి. రైతులకు వ్యవసాయ రుణాలను కిసాన్ క్రెడిట్‌కార్డు పథకం కింద అందించాలన్న నిబంధన క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం- రూ.50వేల వరకు రుణం పొందే రైతులు ఎలాంటి పూచీ ఇవ్వనక్కరలేదు. అయితే, ఓ రైతుకు రుణం ఇచ్చేటప్పుడు బ్యాంకులు మరో రైతు పూచీ ఉండాలని పట్టుబడుతున్నాయి. అలాగే, తనకు ఇతర బ్యాంకులో రుణం లేదన్న ధ్రువపత్రాన్నీ రుణం పొందే రైతు సమర్పించాలని అంటున్నాయి. ఇటువంటి పత్రాన్ని రైతులు సమర్పించాలన్న నిబంధనేదీ రిజర్వ్ బ్యాంకు విధించలేదు. వడ్డీపై ఇచ్చే రుణాలకు సంబంధించిన చట్టం (1918) ప్రకారం- వ్యవసాయ రుణాలపై తొమ్మిది శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదు. సాధారణ వడ్డీని మాత్రమే వసూలు చేయాలి. కానీ, బ్యాంకు శాఖలు తొమ్మిది శాతానికంటే ఎక్కువగా వడ్డీనే కాక, చక్రవడ్డీనీ వసూలు చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన సందర్భాల్లో రైతులు రుణవాయిదాలను గడువులోపల చెల్లించలేకపోయినా- మామూలు వడ్డీపై మూడు లేక నాలుగు శాతం అధికంగా అవి వసూలు చేస్తున్నాయి.

రిజర్వ్‌బ్యాంకు ఆదేశాల ప్రకారం- బ్యాంకులు వ్యవసాయానికి తాము సమకూర్చే మొత్తం పరపతిలో 75శాతాన్ని సన్న, చిన్నకారు రైతులకు అందించాలి. 1985లో రూ.25వేలలోపు రుణం పొందిన రైతులు 49.60శాతం కాగా, 2001 నాటికి ఆ సంఖ్య 13.30శాతానికి పడిపోయింది. కోటి రూపాయలపైబడి రుణాలు పొందినవారి శాతం 400 రెట్లు పెరిగింది. బ్యాంకులనుంచి సకాలంలో రుణాలు లభించనందునే అప్పులకోసం రైతులు ప్రైవేట్ వ్యక్తుల్ని ఆశ్రయించవలసి వచ్చింది. అప్పులపాలైన రైతుల విషయంలో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉందని, రాష్ట్రంలోని 83శాతం రైతులు రుణాల బిలో కూరుకుపోయారని 59వ జాతీయ నమూనా సర్వే నివేదిక వెల్లడించింది. వ్యవసాయ పరపతిని రూ.2,87,000కోట్ల నుంచి రూ.3,25,000కోట్లకు పెంచుతున్నట్లు 2009-2010 బడ్జెట్‌ను సమర్పిస్తూ కేంద్ర ఆర్థికమంత్రి ప్రణబ్‌ముఖర్జీ ప్రకటించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.32,500కోట్లు సమకూర్చనున్నట్లు ముఖ్యమంత్రి వై.ఎస్. 2009-2010 రుణప్రణాళికలో పేర్కొన్నారు. నిజానికి- ఈ మొత్తాలు బడ్జెట్ పద్దుల కిందకు రావు. బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లో డిపాజిట్లుగా సేకరించే మొత్తాల నుంచే రైతులకు రుణాలనిస్తాయి. రైతుల భూములను అవి తమ వద్ద తాకట్టుగా ఉంచుకుని, వారికి రుణాల్ని ఇతర రైతుల పూచీపై ఇస్తాయి. వ్యవసాయ రంగం కంటే పరిశ్రమలకు అనేక రెట్లు అధికంగా బ్యాంకులు రుణాలను సమకూరుస్తున్నాయి. ఆ విషయాన్ని కాక, వ్యవసాయ రుణాల గురించి పాలకులు బడ్జెట్‌లో ప్రస్తావించవలసిన అవసరమేమొచ్చింది? భూమి దున్నటం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు సమకూర్చుకోవడం, పంటల కోతకు ముందు- ఆ తరవాత తీసుకోవలసిన జాగ్రత్తలు, ధాన్యం నిల్వ, మార్కెటింగ్- ఇలా అన్ని దశల్లోనూ రైతులకు పరపతి సౌకర్యం కల్పించడం ముఖ్యం. వారికి అవసరమైన రుణాలను సకాలంలో వ్యవస్థాగతంగా అందించాలి. వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడే దుస్థితి నుంచి రైతుల్ని బయటపడేస్తే తప్ప- వ్యవసాయాభివృద్ధి జరగదు. అన్నదాతల ఆర్థిక స్థితి బాగుపడదు. రైతులకు రుణసదుపాయం కల్పించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం- రాష్ట్రంలో ఉన్న కమతాలను బ్యాంకులవారీగా ప్రత్యేకించాలి. తమకు కేటాయించిన కమతాల రుణ అవసరాలను ఆయా బ్యాంకులు తీర్చాలి. సూక్ష్మస్థాయి ఆర్థిక సంస్థలు, స్వయంసహాయక బృందాలు, మహిళా గ్రూపులు, చెరకు, పత్తి, బియ్యం మిల్లులు- తపాలా కార్యాలయాల ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలను అందించడానికి విధివిధానాలు రూపొందించాలి. మార్కెట్‌యార్డుల్లో ధాన్యం నిల్వ చేసుకోవడానికి గోదాములు ఏర్పాటు చేయాలి. ధాన్యం నిల్వ చేసుకున్న రైతులకు పంట తాకట్టుపై రుణం అందించాలి. ఉషాతోరట్ కమిటీ తన నివేదికలో సిఫారసు చేసిన విధంగా- వ్యవసాయ అనుబంధ రంగాలకు పరపతి అందించేందుకు వారాంతపు సంతలలో సంచార బ్యాంకింగ్ సేవలు ప్రారంభించాలి.

## పరపతి విధానంలో మార్పులు అవసరం

వ్యవసాయ రుణాలను అందించే విధానంలో మార్పులు అవసరం. రైతులకు పాస్‌పుస్తకం ఇచ్చి, ఎ.టి.ఎం. ద్వారా వారు డబ్బు తీసుకునే సౌకర్యం కల్పించాలి. రైతుల భూముల వివరాలు, విలువ పరిగణనలోకి తీసుకుని, వారి రుణ అర్హతను నిర్ణయించాలి. ఆ అర్హతకు లోబడి పాస్‌పుస్తకం ఆధారంగా వారికి రుణాలు సమకూర్చాలి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి ప్రొఫెసర్ వైద్యనాథన్ సిఫారసుల మేరకు కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆ సంఘాలకు అవి అందలేదు. ఆ నిధుల్ని వెంటనే అందించాలని సహకార సంఘాల సమాఖ్యలు కోరుతున్నాయి. రుణప్రణాళికల్లో అంకెల గారడీ చేయకుండా- ప్రతి వ్యవసాయ కమతానికి రుణ సౌకర్యం కల్పించి, వ్యవసాయ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటే... ఆశిస్తున్న వృద్ధి శాతాన్నీ సాధించవచ్చు, ప్రజలకూ ఆహార భద్రత కల్పించవచ్చు. అన్నదాతల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చు. రైతుల సంక్షేమం కోసం ఆ దిశగా బ్యాంకులు, పాలకులు ముందడుగు వేయాలి.

(రచయిత భారత రైతు సంఘాల సమాఖ్య సలహాదారు)